


౧

పరశురామయ్యపంతుల పైసా సాయము లేనిది క్షీరపురిలో కాదుగదా, ఆయూరికి చుట్టుపట్టులలో నుండు గ్రామములలోగూడ పెండ్లిండ్లు కావు; చదువులు సాగవు; నాట్లు పడవు; కోతలు నెఱవేరవు; శిస్తులు చెల్లవు. వేయేల, ధనావసరము గలిగిన ప్రతిపనియు పరశురామయ్యవద్ద ప్రామిసరీనోటు వ్రాసిననే కాని కాదు. ఇప్పటి జనసామాన్యపుస్థితి యట్లున్నది. ఈ విధముగా చూచిన పరశురామయ్య ఆపద్బాంధవు డనియే చెప్పవచ్చును. కాని ఆయన పుచ్చుకొనెడి అధికపు వడ్డీలు చూచినను, నూటికి పదినూరులు పుచ్చుకొనునాడైనను పైసా త్రోసివేయుట కిచ్చగింపని కాఠిన్యమును చూచినను ఆయనను నక్షత్రకు డనువారేకాని ఆపద్బాంధవు డనువారు మాత్రము కానరారు. అయిన నేమి? అయన యివ్వవలెను, వారు పుచ్చుకొనవలెను. కాలము కఱవుకాలము. పంటలు తక్కువ. ఖర్చు లెక్కువ. పిల్లలుజాస్తి. ధనికుడైనవాని నాశ్రయింపక జనసామాన్యము బ్రతుకు టెట్లు? కాబట్టియే ఆగ్రామజనులే కాక ఆచుట్టుపట్టుల నుండు గ్రామముల జనులుగూడ పరశురామయ్య పిడికిలిలోని పిచ్చుకలు. పరశురామయ్య మంచి నైష్ఠికుడు కాని అందులో మతాభిమానముకంటె సాంఘికపీడయు, నిరంకుశత్వమునే యెక్కువగా ద్యోతకమగుచుండును. దానికి తగినట్లుగా పరశురామయ్య మంచి ఒడ్డుపొడుగుగల మనిషి. దానికి తగినట్లుగా మొగము విశాలము. కన్నులు కాషాయపురంగు. అందు వలన భయంకరుడుగా నుండును. ఉదయమే లేచి ప్రాతఃకృత్యములు తీర్చుకొని, స్నానసంధ్యాద్యనుష్ఠానములు తీర్చుకొని, మొగము నిండిన విభూతిరేఖలతో, మెడనిండిన రుద్రాక్షమాలికలతో పంతులు వీథియరుగుపై గూర్చుండెనా, పిన్న పెద్దల కావీథిని నడువ వెఱపు. ఎవరు నడచినను పక్క పక్కలనే.

బుద్ధిశాలియగు విష్ణుశర్మ రాజకుమారులకు హితోపదేశము సేయుటకు కరటకదమనకుల నేనాడు సృష్టించెనోకాని, తత్సంతతివారు ఇప్పటికిని ఉన్నారు. సాధారణముగా పెద్దపెద్ద లంసఱ కీమనుష్యరూప గోమాయువులే కన్ను, కాలు, చెవి, చిత్తము. సామాన్యముగా కులపెద్దలుగా నున్నవారి కేమి, గ్రామపెద్దలుగా నున్నవారి కేమి, మఱి యే యితర స్థానికాధికారములలో నున్నవారి కేమి, ఈకరటకదమనక సంతతివారగు మనుష్య లోకరో, యిద్దరో పార్శ్వవర్తులై యుందురు. ఆపెద్దలకు వారు పెట్టినదే భిక్ష. ప్రత్యక్ష పరిశీలన తక్కువ. న్యాయాన్యాయవిచక్షణ శూన్యము. వారు తిమ్మయనిన తిమ్మ, బెమ్మ యనిన బెమ్మ. అంతకంటె దూరదృష్టి లేదు. పరశురామయ్య పంతులుకు శివయ్య


శాస్త్రి నమ్మిన బంటు. కోపించినప్పుడు చేతులు మోడ్చియు, శాంతుడై యున్నప్పుడు చెవులుకొఱికియు సమయానుకూలముగా పంతులువద్ద మెలగెడి నేర్పు శాస్త్రి కున్నట్లు మఱియొకరికి లేదు. పంతులుకు ఒకరిపై నిగ్రహముగాని, అనుగ్రహముగాని గలుగునట్లు ప్రసంగించుటలో శాస్త్రి కడు చతురుడు. పంతులుతో నేరైన నేవ్యవహారము నైనను జరుపుకొనదలచిరేని వారు శాస్త్రిద్వారా వెళ్లిననే వారికార్యము సఫలము; లేకపోయిన శాస్త్రి పుల్లవిఱుపు మాటలకు వారికార్యము పొల్లుగావలసినదే: కాన పంతులవలని భయముకంటె శాస్త్రివలని భయమే ప్రజల కెక్కువ.

## ౨

ఆయూరికి నడుమ నొకవేపచెట్టు; దానికిచుట్టు నొకగచ్చుటరుగు: దాని కమ్మవారి తిన్నె యని పేరు. దానిపై సాయంత్ర మైదుగంట లగునప్పటికే, పంతులు, శాస్త్రి, వారియనుచరులు కొందఱు సమావేశ మగుచుందురు. ఇక నక్కడ జరుగుచర్చలలో శాస్త్రదృష్టి తక్కువ; ఆచారపు పట్టుదల లెక్కువ. ధర్మనిర్ణయము తక్కువ; అధర్మపు తీర్మానము లెక్కువ. క్షేమవిచారణ తక్కువ; కష్టపెట్టు యత్నము లెక్కువ. సఖ్యపఱుచు యోచన లల్పము; బహిష్కార బాంబుల ప్రయోగ మత్యధికము. ఎవరియింట నాలుమగలు జగడమాడినను, ఎవరి యింట నత్తకోడళ్లు వాదులాడినను, వీరికే. అందులో బలవంతులపక్షము చేరుట, బలహీనుల పీడించుట వారిపని. పంతులు శాస్త్రిని చూచి, 'శివయ్యా! ఏమిటి విశేషాలు?' అని తిన్నెపై గూర్చుండగనే యడుగును. అడుగగనే, 'బాబూ!' వింటివో లేదో: రామయ్యకొడుకు పట్నంలో చదువుకు చేరగానే క్రాపింగు పెట్టినాడు. మొఖాన బొట్టు ఏడ్చుకోడు. ఇటువంటివాడు మాలకూడు తిని వచ్చాడంటే సందేహ మేమిటి? మఱొకసంగతి: సుబ్బయ్య శాస్త్రికూతురు నిత్యము సాయంత్ర మయ్యేటప్పటికి తల్లో పూలు ముడుచుకోకమానదు. పెనిమి టెక్కడనో బొంబాయిలో చదు వేడుస్తుంటే యిదీ పూలు పెట్టుకొని కులకటం యేమిటో అర్థంకాగు. అది సరే. మొన్న వెంకటచలం వ్యాజ్యానికని గుంటూరు పోయి వితంతు వివాహం చేసుకున్న వాడి స్నేహితుడి యింట్లో తాంబూలం సేవించి వచ్చాడట. ఇక గోపయ్య, యింగ్లండు వెళ్లివచ్చిన మాధవరావు తల్లి పింతల్లి ఆడబిడ్డకూతురింట్లో ధప్పళమే కొట్టి వచ్చినాడట. వెంకయ్యకొమార్తె గుఱ్ఱములా గున్నది, ఇంతవఱకు పెండ్లియత్నమే లేదు. ఒకటో రెండో అయ్యేవుంటుంది. అడిగేవా డెవడు? కులకట్టుబాట్లు కూలిపోతున్నవి. వర్ణాశ్రమధర్మాలు, శాస్త్రచోదితకర్మలు వల్లకాడై పోతున్నవి. పెద్దవాళ్లము మన మింకా పూర్వాచారాలు విడవలేక యేడుస్తుంటే ఈకులభ్రష్టుల మూలంగా మనకుగూడా వర్ణసంకరం ప్రాప్తిస్తున్నది. ఇంకా మీవంటి కర్మిష్ఠులు వేదమతాన్ని రక్షిస్తూఉండబట్టి ప్రపంచం యింకా ఏభూకంపపు ఉపద్రవంచేతనో నాశనంకాకుండా నిలిచియున్నది.' అని శివయ్య ప్రసంగముసాగించును. ఆస్తోత్రపాఠములతో పంతులుకు శివము పెరుగును. అతడు నిజముగా తనవల్లనే లోకమంతయు నిలిచియున్న దనుకొనును. వేదమతము నుద్ధరించుటకు తానొక శంకరావతార మనుకొనును. వెంటనే, 'పంపండోయి ఆంక్షాపత్రికలు, వర్ణసంకరం ముండాకొడుకుల కందరికీ' అనును. రాత్రి యెనిమిది తొమ్మిది గంటలవేళ ఈతీర్మానము. తెల్లవాఱియు తెల్లవాఱక మునుపే యింటింటి కొక ఆంక్షాపత్రిక. అదిచూచి యాగృహస్థు లాలగోడు, బాలగోడు. ఇక వారి కేవృత్తులవారు పనిచేయరు. సరిగదా, ఏబావినీళ్లను వారిని తగుల నీయరు. పురోహితులు ఆబ్దికాదికర్మలకు రారు. ఊరివారు భోజనపేరంటములకు బిలువరు. ఈవిధముగా వారెన్నిదినము లగచాట్లుపడుదురు? పాప మాగృహస్థు లీబాధలు పడలేక అమ్మవారితిన్నెమీద వేంచేసియుండు అమాత్యసమేతుడగు బహిష్కారచక్రవర్తిని, అనగా పరశురామయ్యపంతులును, క్షమాపణ కోరియో, అపరాధరుసుము చెల్లించియో, ప్రాయశ్చిత్తము గావించుకొనియో, బహిష్కారమును బాపుకొని, సంఘములో జేరుచుందురు. క్షీరపురిగ్రామస్థులకు పరశురామయ్య ప్రభృతులచే నివి నిత్యపాట్లు.

## 3

పరశురామయ్య పంతులుకు కొమారులు ముగ్గురు: కొమార్తెలైదుగురు. పెద్దకొమారుడు కరిణీకము చేయుచున్నాడు. రెండవవాడు కొంత చదివి మానివేసి, పంట పైరులను, ఇచ్చి పుచ్చుకొను వ్యవహారములను జూచుచు, తండ్రికి సాయముగా నున్నాడు. మూడవవాడగు శంకరుడు బాపట్లలో మెట్రిక్యులేషన్ పరీక్ష నిచ్చి గుంటూరులో ఎఫ్. ఏ. చదువుచున్నాడు. కాని దురదృష్టవశమునకో, అదృష్టవశముననో శంకరునకు ఎఫ్. ఏ. పరీక్ష రెండుమాఱులు పోయినది. మొదటిమాఱేమో ప్రమాదమనుకొనెనుగాని రెండవమాఱుగూడ పరీక్ష పోయిన దన




గనే పరశురామయ్యపంతులు కోడలు మండిపోయినది. "తెలివిమాలిన వెధవా, యీమాటుగూడా తప్పిపోయినావా? నీ వేమో చదివి తాసిల్దారేడుస్తావని మీ అమ్మ యేడిస్తే వెయ్యి రెండువేలు నీబొంవమీద పోశాను. చదివిందీ లేదు యేడ్చిందీ లేదు. యేటేటా తప్పటమే. నీచదువుకు పెట్టినడబ్బు కట్నంగా లాగవచ్చునంటే నష్టంలేదని ఒప్పుకున్నాను. ఇట్లా తప్పే వెధవకు కట్నమెవరిస్తారు? ఇక చాలు, యింట్లో కూర్చో: చదువూవద్దు గిదువూవద్దు". అని యేమేమో తిట్టినాడు. పరీక్ష పోయినందులకే లోలోన క్రుళ్లి యేడ్చుచున్న శంకరునకు తండ్రిమాటలు గోరుచుట్టుపై రోకటిపోటువోలె మహావేదనను గలిగించినవి. ఆదినమెల్ల అన్నము నీళ్లు గానకుండ గదిలో ముసుగుబెట్టుకొని పడుకొని, యేడ్చి యేడ్చి వేసారిపోయినాడు. కడగొట్టుకొడుకని కాబోలు, సుభద్రమ్మకు శంకరునిపై మహాప్రేమ. కాన కొమారుని కడ్డకు బోయి, 'నాయనా! వెధవపరీక్ష పోతేపోయింది. దానికోసం యింతదుఃఖపడట మెందుకు? ఏమో చదివితే మంచి దనుకున్నాము. మనగ్రహచారం చాలక కలిసి రాలేదు. పోనీ,నీవు చదివి సంపాదిస్తేనేగాని పొట్టగడవని సంసారం కాదుగదా? నీవు అన్నము నీళ్లూ కానకుండా యింతగా దుఃఖపడట మెందుకురా బాబూ! మీ తండ్రి మాటలకా, ఆయనమాట లెప్పుడూ అంతే. నీవు తప్పిపోయినావని ఆయనకు దుఃఖం లేదు; డబ్బు నష్టమైందని ఆయన విచారం: అందుకోసం అట్లా వేష్టపడ్డారు. ఆయనమాటలు మనకు క్రొత్తా. ఇవ్వాళ అట్లాగే అంటారు; రేపు ఆయనే మళ్లీ చదువుకోమని పంపుతారు నాయనా! ఏడవ్వద్దు బాబూ ఏడవ్వద్దు' అని తల్లి కడుపు గడ్డం పట్టుకొని బతిమలాడినది. శంకరుని మనస్సు తేరలేదు. ఏ విధముగానైనను పెద్ద పరీక్ష లిచ్చినగాని తనకు ఖ్యాతి లేదని భావించినాడు. కాన యేదేశం పోదాము, ఏమి చదువుదాము; ఎక్కడ చదివివస్తే గొప్పఉద్యోగం దొరుకుతుంది-అని దీర్ఘముగా యోచించినాడు. ఈవిధముగా యోచింప యోచింప, శంకరున కొకయుపాయము తోచినది. దానితో నాతని చింత నివృత్తియైనది. అంత చివాలున లేచి వంటయింటిలోనికి వెళ్లినాడు. తల్లి వంటచేయుచున్నది. ఆమెతో ఏమేమో గుసగుసలాడినాడు. తల్లి మొదట యొప్పుకొనని యట్లు మాట్లాడినది. తరువాత దీర్ఘచర్చమీద అంగీకరించినట్లు తల యూపినది. అప్పటికి ఎనిమిది

గంటల రాత్రి యైనది. శంకరుడు వేగముగా భోజనము చేసి తనముల్లెమూటలు సరుదుకొని చల్లగా తొమ్మిది గంటలకు వచ్చు పట్నంప్యాసింజెరుకు వెళ్లిపోయినాడు. మద్రాసు ప్యాసింజెరుకూత వినినగాని అమ్మవారి తిన్నె దిగుపద్ధతి లేదు పంతులుకు. ఆవిధముగానే రైలుకూత వినగానే యింటికి వచ్చి భోజనము చేసి పడుకొనినాడు పంతులు. శంకరునిమీద కోపము వచ్చియుండుటచే నతని సమాచారము పరశురామయ్య అడుగలేదు, సుభద్రమ్మ చెప్పలేదు. ఆరాత్రి గడచిపోయినది.

ఉదయము స్నానసంధ్యాద్యనుష్ఠానము లన్నియు తీరినవెనుక రాత్రి చేపెట్టెలోని యెనిమిదివందల రూపాయలును ఇనుపపెట్టెలో పెట్టనిమాట పంతులుకు చప్పున జ్ఞాపకము వచ్చినది. తటాలున వెళ్లి చేపెట్టె తెరచినాడు. ఇక నేమున్నది? రూపాయలసంచి లేదు. పంతులుగుండె గుభేలుమనినది. మొగము వెల్లనైనది. చేతులు వణకినవి. సంభ్రమస్వరముతో భార్యను కేకలెట్టిపిలిచి, 'రూపాయలసంచి లేదేమే' అనినాడు. 'ఏమో నాకేమి తెలుసు? ఎక్కడ పెట్టుకున్నారో బాగా చూచుకోండి' అన్నది సుభద్రమ్మ. 'ఇంకెక్కడ పెట్తాను? నిన్నసాయంత్రమే గదా, రామిరెడ్డి యెనిమిదివందలు యిచ్చిపోయినాడు! రాత్రికి యినుపపెట్టెలో పెట్టవచ్చును, ఇంతలో ఏమైపోతుందని ఈచంమాకాలోనే పెట్టిపోయినాను. రాత్రి జ్ఞాపకం లేకపోయింది. యిప్పుడు చూస్తే లేదు. వేసిన తాళం వేసినట్లే ఉంది. పెట్టినకాగితాలు పెట్టినట్టే ఉన్నాయి. ఎవరు తీశారు? పెద్దవాడు జమాబందీకి వెళ్లినాడు. చిన్నవాడు అత్తవారింటికి పోయినాడు. ఇక ఎవరు నాపెట్టె తీశారు? శంకిగాడేమైనా తీసి ఉంటాడా? ఏడీ శంకిగాడు?' అని సంభ్రమముతో ప్రశ్నించినాడు పంతులు. 'ఏమో' అనినది సుభద్రమ్మ.

'బహిర్భూమికి పోయినాడా?'

'ఏమో నే చూడలేదు.'

'అన్నిటికి యేమో యేమో అంటావు, నీదుంపతెగ, ఎక్కడికి పంపించావు చెప్పవే' అని పంతులు పట్టరానికోపముతో పండ్లు పటపటకొఱుకుచు పలికినాడు.

'రాత్రినుండి వాడిమొగమే చూడలేదు. నన్నడిగితే నాకేమి తెలుస్తుంది?' అని సుభద్రమ్మ అక్కడనుండి వెళ్లిపోయినది.

'ఏమో మాయగా వుంది' అని పంతులు పదిమందిమనుష్యులను పిలిపించి నలువైపులకు పంపినాడు. రైలువద్దకు పంపినాడు. వాళ్లు నలువైపుల వెదకివచ్చి కనుపడలేదని పంతులతో చెప్పినారు. అంతటితో రూపాయలచౌర్యము శంకరునిపనియే యని పంతులుకు రూఢిగా తోచినది. 'ఏమే, ఎక్కడికైనా పోతానన్నాడా, శంకరుడు?' అని భార్యను పిలిచి అడిగినాడు. 'నాతో చెప్పలే'దన్నది సుభద్రమ్మ. శంకరునిమీద కోపమెక్కువైనది పంతులుకు. 'వెధవ, ఎనిమిదివందలు యెత్తుకొనిపోతే ఏమవుతుం దనుకొన్నాడు? ఒకవేళ యీయెనిమిది వందలతో ఈ ఎస్సే ప్యాసయినా బియ్యే వెళ్లా చదువుతా డనుకుంక? పస్తులుపడి చస్తున్నాడన్నా పైసా పంపను. ఏమన్నా కానీ, వాడు నాకు కొడుకు గాడు; నేను వాడికి తండ్రిని కాను. నేటితో సరి. వాడికి నాగడప త్రొక్కే ప్రాప్తి పోయిం' దని చిత్తము వచ్చినట్లెల్ల శంకరుని చెడతిట్టి, యంతటితో కసిదీరక భార్యను తిట్టి, అంతకును ఉమ్మలికము దీరక నౌకరులను దిట్టి, తనకీసొద తెచ్చిపెట్టిన యింగ్లీషుచదువును తిట్టి, తాను డబ్బు ఇనుపపెట్టెలో పెట్టుకొనకపోయినందులకు తన్ను దిట్టుకొని, నోరు నొచ్చి వూరుకొనినాడు పరశురామయ్య.

## ౪

శంకరుడు ఇల్లు వదలి వెళ్లి వారము దినములైనది. మధ్యాహ్నభోజనానంతరము నిద్రపోయి లేచి విసనకఱ్ఱతో చెమట నార్చుకొనుచు సావడిలో కూర్చున్నాడు పరశురామయ్య. సుభద్రమ్మ పెనిమిటి కెదురుగా కత్తిపీట ముందు వైచుకొని కూర్చుండి మామిడిపండు ముక్కలు కోసి పెనిమిటి కందించుచున్నది. ఇంతలో తపాలా బంట్రౌతు ఒకజాబును తెచ్చి పంతులు కిచ్చి వెళ్లినాడు. తినుచున్న మామిడిపండు ముక్కల నావల బెట్టి పరశురామయ్య సులోచనముల దెమ్మని భార్యతో

జెప్పినాడు వెంటనే గదిలోనికి వెళ్లి ముక్కద్ద ములను తెచ్చి యామె పెనిమిటి కిచ్చినది. భుజము పైనున్న కొల్లాయితో కంటియద్దములు తుడిచి కన్నులకు బెట్టుకొని, తత్తరపాటుతో నుత్తర మొక్కమాఱు చదివి, "అయ్యో!"అని పెద్దకేక పెట్టి, నిశ్చేతనుని వోలె




గోడకు చేరగిల బడిపోయినాడు. "అయ్యో! ఏమి! ఏమి!" అని మొఱవెట్టుచు కొయ్యయైపోయిన పెనిమిటిని సుభద్రమ్మ తియ్యబోయినది. మొదట పంతులు పెట్టిన గావుకేకను, తరువాత సుభద్రమ్మ యేడ్చిన యేడ్పును విని యింటిలోనివారును, నిరుగుపొరుగువారును పోగైనారు. బహువిధోపచారములు చేసినమీదటగాని పంతులుకు ప్రాణము చేరుకొనలేదు. తెలివి రాగనే, "నాకొంప మునిగింది: నే నెట్లా బ్రతికేది?" అని పంతులు మరల దుఃఖింప సాగినాడు. పెనిమిటి యేడ్చుచుండెనని భార్య యేడువ సాగినది. వారిని చూచి బిడ్డ లేడువసాగినారు. వారంద అను జూచి యితరులు కంట తడిపెట్ట మొదలిడినారు. ఈవిధముగా నొకయఱగంట గడచిపోయినది. సమాచార మెఱిగి యేడ్చుచున్న దొక్కపంతులే: తక్కినవారంద ఱాతని యేడ్పునుజూచి యేడ్చుచున్నవారే. సంగతి తెలియకుండ యేడ్చుట బాగుగ లేదని పంతులు పెద్దకొమారుడైన లక్ష్మీపతికిదోచినది. కాన నతడు దుఃఖమును కొంత యుపశమింపజేసికొని ఉత్తరమును విప్పి చూచినాడు. అం దిట్లు వ్రాయబడియున్నది:

"రాజమాన్య రాజపూజితులైన శ్రీ కోటంరాజు పరశురామయ్య పంతులు నాన్నగారికి తమకొమారుడు శంకరు డనేక సాష్టాంగనమస్కారములు. తర్వాత- నేను మూడుదినముల క్రిందట యీ బొంబాయికి వచ్చితిని. ఇచ్చటనుండి శ్రీ హృదయపు స్టీమరులో సీమకు వెళ్లుచున్నాను. మీ చేపెట్టె లోని యెనిమిదివందల రూప్యములను నేనే తీసికొనివచ్చితిని. నేను బారిష్టరుపరీక్ష యై వచ్చుట కగువ్యయ మంతయు గుంటూరు లోని యొక న్యాయవాది యొసంగునట్లు ఆయనకు నాభాగపు ఆస్తిని తాకట్టువెట్టి యేర్పఱచుకొని వచ్చితిని. పరీక్షయం దోడిన యవమానమును తీర్చుకొని, తగు ఉద్యోగమున కర్హుడ నైన వెనుకనే తమ దర్శనము చేయగలను. క్షమించవలెను. మహాలక్ష్మి సమాన యగు మా తల్లిగారికి నా నమస్కారములు.

బొంబాయి, ౨-౬-౨౮. } ఇట్లు: విధేయపుత్రుడు,
శంకరుడు.

లక్ష్మీపతి యుత్తరము చూచుట ముగియుటతోడనే, 'ఏమిటి, ఏమి'టని అంద అడిగిరి. 'ఏమీలేదు. మావాడు సీమకు వెళ్లుతున్నానని ఉత్తరము వ్రాశా' డని అత డనెను. ఆమాట వినుటతోడనే, 'పంతులుకు బలేశాస్తి అయింది. ఊరందఱిని ఉత్తుత్త నెపములు కల్పించి వెలి పెట్టినట్లు గాదు' అని లోలోన సంతసించుచు గుమి

కూడినజను లెక్కచేయక రక్కడకు వెళ్లిపోయిరి. ఏమి ప్రమాదమో అని భయముతో నేడ్చుచున్న సుభద్రమ్మ ఆసమాచారము వినుటతోడనే యాసమాచారము తాను కొంతకొంత యెఱిగినదే యగుటచే ఏడ్పు మానివేసినది. కాని శిష్టాచారసంపన్నుడనని డాబులుకొట్టుచు, కారణము లేని నెపములు కల్పించి యూరిజనుల బహిష్కారములతో బాధింపుచు, నిరంకుశుడై వర్తింపుచున్న పంతులాయవమానము నెట్లు భరింపగలడు? పాపము. పంతులా యవమానదుఃఖమును సైరింపలేక, నలువురలో తల యెత్తుకొని తిరుగజాలక, యింట్లోనుండి బయటికి రాలేదు. తననిష్ఠ నీళ్లగలిసెనే, తనకే బహిష్కారకర్మము పట్టెనే యని లోలోన కుములుచు, అన్నము నీళ్లు గానక, చిక్కి శల్యమై, మంచము పట్టిపోయినాడు. పాప మాతడు వచ్చి కూర్చుండకపోవుటచే నమ్మవారి తిన్నె చిన్నపోయినది. తమ బహిష్కారవ్యాపారమునకు విఘాతము గల్గుటచే శివయ్య ప్రభృతులకు వెఱ్ఱెత్తినట్లయినది.

## ౫

శివయ్యశాస్త్రికి ఒకతే ఒక్కకూతురు: పార్వతి చక్కనిచుక్క; పరువమందిన బంగరు బొమ్మ. ఆ బిడ్డకు విద్యాబుద్ధులు గఱపుటలో పూర్వాచారపరాయణుడగు శివయ్య నూత్నపంథా త్రొక్కినాడు. అతని యనూనకృషిచే పార్వతి గీర్వాణాంధ్రముల యందు మంచిప్రజ్ఞావతి యైనది. "ఊరివారి నందఱిని ఊరకనే ఆక్షేపిస్తావు. నీమదొరసానిలాగ నీకూతురుకు ఆచదువేమి"టని ఎవరైన నడిగినచో,"అయ్యా' ఏమి చెయ్యను? నాకు కొడుకైనా అదే, కూతురైనా అదే-నా ముచ్చటెట్లా తీరాలి?" అని దీనముగా జెప్పి తప్పించుకొనువాడు. "అవును పాపము" అని లోకులుకూడ మనస్సమాధానము చేసికొనువారు.


శివయ్య శ్రమపడి రెండువేలు పోసి పార్వతివిద్యాబుద్ధులకు దగినవరుని బి. ఏ. పరీక్షకు జదువుచున్నవానిని తెచ్చి పెండ్లిచేసినాడు. కాని విధివిధానమును దప్పింప నెవరితరము? శంకరుడు సీమకు వెళ్లిన యాఱుమాసములకు రాజమండ్రిలో చదువుచున్న పార్వతి పెనిమిటి గోదావరిలో నీతగొట్టపోయి యందుపడి మరణించినాడు. ఎవతెను తమ ప్రాణపదముగా నెంచుచుండిరో అట్టి తమ ప్రియకొమార్తెకు రారాని దురవస్థ ప్రాప్తించినప్పుడు తల్లిదండ్రు లెట్లు సైపగలరు? అందు శివయ్య దుఃఖము తల్లిదుఃఖముకంటె మిన్నయై పోయినది. పాప మాతడు నేల నంటిపోయినాడు. 'వాని వెధవకూతురు నగలుపెట్టుకుంటున్నది. వీని వితంతుకొమార్తె రెవిక తొడుక్కొంటున్నది. వానికూతురు సకేశి; వానియింట బ్రాహ్మణార్థము చేయరా'దని నిరంతరము ఊరిజనుల నాక్షేపించుచు పంతులుతో కొండెములు చెప్పి ఆంకాపత్రిక లంపుచు బాధించెడిశివయ్య కిట్టికష్టము ప్రాప్తించినందులకు 'పాపకర్మునకు దగినశాస్తి అయిం'దని ఆతనితో నగచాట్లు పడినవారు కొందఱు సంతోషించినను, పెక్కుమంది లావణ్యవతియైన పార్వతి దురవస్థకు మిక్కిలి దుఃఖపడిరి. ఈదుఃస్థితిలోనే అభాగ్యురాలగు పార్వతి రజస్వలయైనది. ఏకకఠోరనియమములు వితంతువు లవలంబింపవలెనని శాస్త్రి రూక్షముగా బలుకుచుండెనో, ఆకఠోరనియమములను తనప్రేమైకనిలయమైన పార్వతిపై ప్రయోగించుట యనిన శివయ్యహృదయము విదారించికొనిపోయినది. 'అయ్యో,ఆపాడురూపము నేను చూడలే'నని తల గొట్టుకొని యేడువసాగినాడు. 'అయ్యో!పదునాలుగేండ్ల పిల్లేగదా, ఇంకా రెండేళ్లు చీరరెవికలు కట్టుకొంటేనేమి? చెవికమ్మలైనా పెట్టుకుంటేనేమి? చేతి బంగారుగాజులైనా ఉంచుకుంటేనేమి?' అని యోచన సాగించినాడు.తలనొప్పియు, దారిద్ర్యమును తనదాక వచ్చినగాని తెలియదని లోకసామ్యము గదా.

## ౬

మూడేండ్లు గిఱ్ఱున తిరిగిపోయినవి. శంకరరావు బారిష్టరు శంకరరావై స్వదేశమునకు తిరిగి వచ్చినాడు. తనరాక ముందుగా తల్లిదండ్రులకును, బంధుమిత్రులకును దెలియబఱచినాడు శంకరునిఆగమనవార్త దెలియబడగనే యింట్లో పెద్దవివాదము బయలువెడలినది. 'వస్తే రానీ' నాగడప తొక్కనియ్య'నని పరశురామయ్య వాదన.

'మూడేండ్లక్రిందట ఇల్లు వదలి పోయినబిడ్డ నేటికి మరల దేశంలోకి వస్తుంటే నేను చూడకుండా ఉండలే'నని సుభద్రమ్మ యేడుపు. వాడికి మనయింట్లో అన్నము పెట్టవద్దు;నీళ్లు పొయ్యవద్దు. ఇంటికి వచ్చి చూచిపోనీ, దానిలో తప్పేముం'దని కొడుకులసమాధానము. 'శంకరుడు యింటికే రావాలె-పంతులుకు బహిష్కారపత్రిక పంపించేదే. అందఱిని వెలిబెట్టినట్టుగాదా, తనకు యింకోధర్మమా?' అని యూరిలోనివారి ఆలోచన. పంతులుకు ఎటు చేయుటకును తోచలేగు. శంకరు నింటికి రానిచ్చినచో గ్రామస్థులు తన్ను బహిష్కారావమానమునకు పాల్పరచెదరని భయము. రానీయకున్న భార్యాపుత్రులతో తీవ్రమైన పోరాటము. ఏది చేయును,ఏదిమానును? ఎటు చూచినను గళ్ళబద్ధకముగనే యున్నది. ఆలోచింప నాలోచింప, గ్రామస్థుల బహిష్కారమునకైన నొప్పుకొననగును గాని భార్యాపుత్రులతో పోరాడుటకు పరశురామయ్యకు సాహసము కలుగలేదు. ఏలయందురా: "శంకరునితో నిర్దాక్షిణ్యముగా పోరాడినందుననే నాత డిట్లు విదేశ మేగుట ప్రాప్తించినది. అట్లు గాక 'నాయనా! పరీక్ష పోతే పోయింది, మళ్లీ చదువరా' అంటే శంకరు డింత సాహసం చేసేవాడు కానేకాడు గదా! కాబట్టి ఒక అవివేకమువల్ల కుటుంబమున కిట్టి యాపద తెచ్చినాను. ఇప్పుడు ఈ భార్యాపుత్రులతో గూడ వివాదము పెట్టుకొనినచో వీ శ్లేమి చేస్తారో! యిందువల్ల మరల యెట్టికుటుంబచిక్కులు వస్తాయో!" అని పంతులుకు మనస్సులో పెద్దభయము పుట్టినది. కాన ఎటును సమాధాన మీయకుండ ఊరకొనినాడు. తండ్రి మౌనము చూచి తమ్ము నింటికి పిలుచుకొని వచ్చుటకు అన్న లిరువురు పూనుకొనినారు.

మఱునాడుదయము రైలువద్దకు వెళ్లి అన్న లిరువురు శంకరు నింటికి తీసికొని వచ్చినారు. సుభద్రమ్మ కొమారుని కౌగిలించుకొని తన యనుపమాన వాత్సల్యమును నయననిర్గతబాష్పబిందువులచే వెల్లడించినది.




మొక్కవోయిన కత్తివలె, కోఱలు పెఱికిన సర్పమువలె, వాడిచెడిన వాడై, ఖేదమోదశూన్యమైన నిర్వికార నిరాలాప నిశ్చల దృష్టితో కొమారునకు స్వాగత మిచ్చినాడు పంతులు.

శంకరు డింటికి వచ్చిన సమాచారము ఒక్క నిముసములో గ్రామమంతటను వ్యాపించినది. సంబంధము లేని వారికిగూడ నూహాపోహలతో సంబంధములు గల్పించి పంతులుచేసిన బహిష్కారములచే బాధింపబడియున్న గ్రామస్థులకు పంతులుపై కసిదీర్చుకొనుటకు మంచియవకాశము లభించినది. అనామకులందఱు నాయకులైనారు. మూలనున్నవారెల్ల ముందుకువచ్చినారు. 'వాకిట్లోకివచ్చినవాడు వంటయింట్లోకి వచ్చియుండడా? పంతులుపై బహిష్కారపుగుండు ప్రయోగింపవలసినదే. అని నిశ్చయించి

నారు. ఆసాయంత్రము అమ్మవారితిన్నె గ్రామజనులతో బిలబిలలాడినది. బహుదినములనుండి బహిష్కార నాయకులలో నొకడుగా నుండుటచే నొప్పుదల లేకున్నను శివయ్య సభాధిపతిగా నుండుట తప్పనిసరి యైనది. సరే యని సభాధిపతిగా కూర్చున్నాడు. 'ఈగ్రామపెద్దయు, శిష్టాచారసంపన్నుడును నైన శ్రీ కోటంరాజు పరశురామయ్య పంతులుగారు, ఇంగ్లండు వెళ్లి మూడువత్సరములు దొరలతో మద్యమాంసాదులు సేవించి వచ్చిన కొమారుని యింటికి రప్పించి, యెట్టి ప్రాయశ్చిత్తము లేకుండ పంక్తిభోజనము పెట్టినారు గావున, వారిని బహిష్కరించడమైనది. నేటినుండి యీగ్రామస్థు లెవ్వరును శుభాశుభకర్మలకు వారిని తమయింటికి పిలువరాదు; వారింటి కెవ్వరును పోరాదు. అన్ని కులముల వారు ఈకట్టడికి లోబడి యుండవలెను. అట్లు లోబడని వారు తమకులస్థులచే వెలివేయబడుదురు.' అని తీర్మానించినారు.

౭

పార్వతి శంకరునకు చిన్ననాటి నేస్తకత్తె. వారిద్దఱి కారేడువత్సరములు వ్యత్యాస మున్నను వారిద్దఱు చాల స్నేహముగా నుండువారు. బుద్ధిమతి యగు పార్వతికి శంకరుడు తనచెల్లెలితోపాటు చదువు చెప్పుచుండువాడు. ఆసమయములో తనసౌందర్యవివేకములచే శంకరునిమనస్సు కొల్లగొనినది పార్వతి. ఆమెబుద్ధి నైశిత్యమే శంకరున కామెపై నకారణప్రేమను గలుగజేసినది. ఆతడు పెద్దవాడై ఉన్నతతరగతులలో జదువుచుండెడి దినములలో గూడ సెలవుదినములలో తాను వచ్చినప్పుడు దినమున కొకటి రెండు మాఱులు శివయ్య యింటికి వెళ్లి పార్వతిని చూడకుండ నుండువాడు కాడు. బాలికలు చదువుకొనుట యనిన శంకరునకు మహా అపేక్ష. "పార్వతి శ్రద్ధగా చదువుకొంటుందని, చూడు, ఎంతప్రేమగా విచారించిపోతాడో! పట్నవాసాల్లో చదివే పిల్లలకు మహాగర్వం ఉంటుంది: పాపం, శంకరుడికి అటువంటివేషాలు లేవు. చిన్ననాడు ఆడుకొన్న సావాసంగూడా మఱచిపోకుండా పార్వతిని చూచి పోతాడు!" అని పార్వతి తల్లిదండ్రులు వాత్సల్యపూర్వకముగా శంకరుని శ్లాఘించుచుండెడివారు.

ప్రస్తావవశమున తల్లి పార్వతి వైధవ్య మందిన సమాచారము శంకరునకు చెప్పినది. శంకరుని దయాపూర్ణహృదయమున నా వార్త పిడుగుబోలె దాకి యాతని హృదయమును విదారించినది. 'అంత మంచి పార్వతికి, అంతవిద్యావతియైన పార్వతికి, అంత సౌందర్యవతియైన పార్వతికి, వైధవ్యమా! అయ్యో, విధాత యెంత నిష్కరుణుడు!' అని నివ్వెఱబోయినాడు శంకరుడు. అప్రయత్నముగా నతని నేత్రములనుండి యశ్రువులు జలజల రాలినవి. ఆ దుఃఖ మాపుకొనుటకే అతని కెంతయో కష్టమైనది. పరస్పర ప్రేమ ప్రకటనము గావించుకొనుచు, స్త్రీ పురుషులు యథేచ్ఛముగా సంచారముచేసెడి దేశములో శంకరుడు మూడేండ్లు గడపివచ్చినాడు; పెక్కుమంది స్త్రీల గలసి వసించినాడు; చదువుకొనినాడు; విహారములు సల్పినాడు: కాని యతని వినిర్మలచిత్త మెప్పుడును కళంకితము గాలేదు. విద్యావిహారముల స్వేచ్ఛావర్తినులైన పాశ్చాత్యనాగరక యువతీమణులయెడ నాతని హృదయ మెప్పుడును నాకర్షింపబడలేదు. అమాయకమును, సౌమ్యమునగు హైందవసాధ్వీముగ్ధస్వరూపము పార్వతీరూపమున నాతని చిత్రఫలకమున నంకితమై యుండుటయే యందులకు కారణము. పార్వతి వివాహిత యయ్యెనని యాతనికి తెలియును. ఆమెపై తనప్రణయదృక్కుల బ్రసరింపరాదనికూడ ఆతడు తలంచెను. కాని తనకు పత్నిగా నుండెడియువతి యిట్టి ముగ్ధమోహనసుందరియై యుండవలెననెడి తలంపునుమాత్ర మాతడు తనహృత్సీమనుండి తొలగింపజాలకపోయెను. ఈవిధముగా తనహృదయోద్యానమున గోముగా పెంపబడుచుండెడి ప్రేమలతయైన పార్వతి దుర్భరవైధవ్యదుఃఖమునకు పాల్పడినదని వినుటతోడనే శంకరు డామెను చూడకుండ నుండలేకపోయినాడు. కావున తనరాకకు గ్రామస్థులు చేయుచున్న సందడియు, శివయ్య పూర్వాచారపరాయణత్వమును బాగుగా నెఱిగియుండియు, శంకరుడు చివాలున లేచి పార్వతిని చూచుటకు వెళ్లిపోయినాడు.

## ౫


శంకరుడు శివయ్యయింటికి వెళ్లినప్పటికి పార్వతి తలిదండ్రు లిరువురును నింట లేరు. చింతకు కాణాచియై యున్న మొగముతో, నశ్రువుల కునికిపట్టైయున్న కన్నులతో పార్వతి యాతనికి సావడిలోనే కన్పడినది. ఆమెను చూచుటతోడనే శంకరునకు మహాదుఃఖము వచ్చినది: అచేతనునివోలె యట్టె నిలువబడిపోయినాడు. అతనిని చూడగనే పార్వతికిగూడ పట్టరాని యేడుపు వచ్చినది. ఆతనియెదుట నిలువబడుటకుగూడ నశక్తురాలైనది. కాని విధివశమున నాసమయమున నామె తలిదండ్రు లిరువురుగూడ నింట లేకుండుటచే దుర్భరవైధవ్య దుఃఖోపహతచేతస్క యగు పార్వతియే యాతనిని కూర్చుండుడని మర్యాద చేయక తప్పినదికాదు. కాన పొంగిపొరలివచ్చుచున్న దుఃఖము నెట్లెట్లో కంఠగతము గావించుకొని, కుర్చీవైపు చేయిచూపి, 'కూర్చోండి' యనినది. దుఃఖభారముచే నిలువ నశక్తుడై యున్న శంకరుడు తత్క్షణమే కుర్చీలో కూలబడినాడు.

పార్వతికి పదునారువర్షములు వచ్చియున్నవి. కాన నామె యవయవముల పొందికయు, మేనిచాయయు నినుమడించి యుండెను. ఆమె యింకను చీరరవికెలను ధరించియుండెను. మఱియు నలంకారములను గూడ పూర్తిగ పరిహరించియుండలేదు. అయినను నవియెల్ల నిర్జీవశరీరమున కలంకరింపబడినట్లున్నవే కాని యామె కెట్టిశోభ నొసంగుటలేదు. ఆ అరుణాధరముపై చిఱునవ్వు కఱవై యున్నది. ఆ విశాలలోచనములలో నౌత్సుక్యోల్లాసముల భావమై యున్నవి. ఆచంద్రార్ధసదృశ లలాటభాగమున కుంకుమరేఖ కొఱవై యున్నది. ఆనిద్దంపు చెక్కుటద్దము లశ్రుధారాకళంకితమై యున్నవి. ఇరులు గ్రమ్మినట్లు ఎటు చూచిన విషాదచ్ఛాయలే మొగమున నుట్టిపడుచున్నవి. అట్టిస్థితిలో రూపవతియయ్యును పార్వతి విరూపవలెనే కన్పట్టుచున్నది. పార్వతి దైన్యాకృతి చూడంజూడ శంకరునిదుఃఖము దుర్భర మయ్యెను. అత డామెను బలుకరించుటకు గూడ నశక్తుడయ్యెను. లజ్జావనతయు, దుఃఖవిహ్వలయు నైన పార్వతిగూడ నాతని నెట్టికుశలప్రశ్నయు సేయలేదు. గోడ నానుకొని నిలువబడినది నిలువబడినట్లే యుండిపోయినది. పదినిముసములపాటట్లె కడచిపోయినది. ఆపన్నురాలైయున్న పార్వతిని పలుకరింపవలసిన భారము తనదే యని శంకరునకు తోచినది. కాని, 'యేమని పలుకరింతును? నాయోదార్పు ఆమెదుఃఖమును దూరీకృతము చేయునదిగా నుండవలదా? ఇట్టి విద్యాసరస్వతికి, ఇట్టి భూలోకసుందరికి, ఇట్టి అనాఘ్రాతకుసుమమునకు మాంగల్యశోభ నొసంగని వట్టి యోదార్పులవలన ప్రయోజన మేమి?' అనుకొనినాడు శంకరుడు. కాని, 'యట్టిసూచన లేమైన చేసిన పార్వతియంగీకరించునా? శుద్ధవైదికుని కడుపునబుట్టిన బిడ్డగదా!' అని మరల యోచించినాడు. 'వేదమతమే యంగీకరించునో వైదికు లాచరించుటలో నాక్షేపణ మేమి? కాన గీర్వాణపండితురాలగు పార్వతిని పునస్సౌభాగ్యమును బడయుటకు గీర్వాణభాష నేశోధించి తరింపవలసినదని హెచ్చరించుట యుక్త'మని శంకరునకు తోచినది. 'అదియామెకష్టమును తొలగించుటకు యథార్థమైన యూరడింపు.'అని శంకరు డూహించినాడు. ఇందువ్రాయుటకు కొన్ని నిముసములు పట్టెనేకాని శంకరుని మనస్సీమ నిట్టిభావములు మెఱుపులు మెఱసినట్లు క్షణములో మెఱసిపోయినవి. శంకరుడు లేచినాడు; పార్వతివంక చూచినాడు. అవిరళాశ్రుధారలచే నామె లలితకపోలము లార్ద్రములై యుండుట శంకరునకు కన్పట్టెను. శంకరు డిక మనస్సు నిలుపలేకపోయెను. తనమాట లెవరైన విందురను శంకనో, ఏమో,పార్వతినొకింత సమీపించి, "పార్వతీ! ఏడువకుము. ఆర్షమతము నీ సౌభాగ్యమును పునరుద్ధరించగలదు." అని చెప్పి వెడలిపోయెను. ఆపలుకులును, ఆయెడ నాతడు చూచిన చూపులును పార్వతి హృదయమున నాశాంకురముల మొలకలెత్తించినవి.

## ౬

గ్రామస్థులు గావించిన బహిష్కారతీర్మానము ఆరాత్రియే పరశురామయ్యపంతులు కందజేయ బడినది. అది చూచి పంతులు నిశ్చేష్టుడైపోయినాడు. 'అయ్యో! పూలమ్మినయూర కట్టె లమ్మవలసివచ్చె'నని, దుఃఖము

పడినాడు. తెల్లవాఱిన తరువాత గ్రామస్థుల మొగము చూచుట కాతనికి మొగము చెల్ల లేదు. కాన ఆరాత్రియే




"పార్వతీ! ఏడువకుము. ఆర్ష మతము......పునరుద్ధరించగలదు"

మూట ముల్లెలు గట్టుకొని కాశీకి వెళ్ళిపోయినాడు. సుభద్రమ్మ యాతనిని వెంబడించినది. ఊరిలోని కోలాహలము చూచి శంకరుడు గూడ నారాత్రియే గుంటూరు వెళ్ళినాడు. తెల్లవాఱగనే బహిష్కార ప్రభావము పంతులింటివారికి బాగుగా కన్పట్టినది. పనిమనిషి రాలేదు. చాకలి రాలేదు. పంచాంగపు బ్రాహ్మణుడు, నీళ్లు పోయు సుబ్బమ్మ రాలేదు. ఎన్నడు నెఱుగని యీ దురవస్థకు పంతులు కొడుకులు, కోడళ్లు అడలిపోయినారు. అలవాటులేని పనులన్నియు చేసుకొని ఆదినము వారు భోజనము చేయునప్పటికి మూడుఝాములు గిఱ్ఱున దిరిగిపోయినవి.

పల్లెటూరి బహిష్కారములలో మతనిష్ఠకంటె పగసాధింపులే యెక్కువగా నుండును. ఆపట్టింపుల కర్థముండదు. ఆ ఆంక్షలలో న్యాయ ముండదు. దొరలకు గూడ గుడ్డ లుతుకు చాకలులు దొరల దేశమునకు వెళ్ళివచ్చినవాడు వచ్చిన యింటివారికిగుడ్డ లుతుకకునుటలో నర్థ మేమున్నది?

## ౧౦

మానవులు తలచిన తలపులెల్ల, దలపెట్టిన కార్యములెల్ల నిర్విఘ్నముగాను, నిరంతరముగాను జరుగుచున్నచో, బలవత్ప్రభువులు 'భగవంతు డనువాడు లేడు: మేమే భగవంతుల'మని డప్పు బజాయించువారే; కాని అపారశక్తి సంపన్నుడగు పరమేశ్వరుడు వారి నొకకంట కనిపెట్టి వారి యత్నములకు విఘ్నములనో, వంచనలనో, పరాభవములనో కల్పించి తన జగన్నాథత్వమును నిలుపుకొనుటవలననే ప్రజాప్రపంచ మాయనను మఱవజాల కున్నది. దీనశరణ్యు డగు భగవంతు డట్లు తనమహామహిమను బ్రకటింపకున్నచో మతసంఘ రాజకీయార్థికబలోపేతుల రాయిడికి దీనజనులు డిందవలసిన దేకదా!

ఇంకను బాగుగా తెల్లవాఱనైన లేదు— శివయ్యశాస్త్రి కొమార్తె యెక్కడకో పోయిన దటవెడుచున్నారు, అనువార్త యూరిలో బడినది. ఒకరినుండి యొకరికి ఊరంతట నొక్కక్షణములో వ్యాపించినది. వైధవ్య దుఃఖము భరింపలేక ఎందులో బడినదో, ఏమైనదో అని ఊరంత వెదకిరి. కాని పార్వతిజాడ కన్పడలేదు. అందుమీద, "పెండ్లి చేసుకో పోయిందేమో" అని కొందఱు; "పెండ్లి పెటాకులు దీన్నెవడుచేసుకోవచ్చాడు? ఎవడో మోసగించి తీసుకుపోయినా"డని కొందఱు; ఛా, అటువంటిది కాదు; మంచియోగ్యురాలు. యింట్లోకాలు బయటపెట్టియెఱగదు. మూడేండ్లయినదిగదా మగడుచచ్చి, ఒక్కచెడ్డమాట విని యెఱగము. తలవని తలంపుగా యింత సాహసం చేస్తుందా?"అనికొందఱు; "ఏమిఎఱుగనట్లుండే వాళ్లే యెంతపనైనా చేసేది" అని కొందఱు; "అదికాదు. మొన్న పంతులుకొడుకు శివయ్య యింటికి వెళ్లినట్లు

విన్నాముకాదా; వాడే దాన్ని లేవదీసి ఉంటాడు" అని కొందఱు—ఎవరికి దోచినట్లువారు వ్యాఖ్యానము సేయ సాగించినారు. ఊరిలో ప్రజలగోల యిట్లుండ, తలిదండ్రుల గోడు చూడ శక్యము గాకున్నది. అల్లుడు పోయినందుకే యల్లాడుచున్నవారికి ఆకూతురుగూడ కంటికి కఱవై పోయినప్పుడు వారేవిధముగా భరింపగలరు? ఆదినమున వారు పాచిమొగములుకడుగుకొనలేదు; పాచి వాకిలి యూడ్చుకొనలేదు; పండినపక్కలపైనుండి లేవలేదు: కన్నీటితో పక్కలు తడుపుచు అట్లే పడియున్నారు. ఎవ రెన్నివిధముల నోదార్చినను వారు దుఃఖవిముక్తులు కాలేదు.

ఆదిన మావిధముగా గడచిపోయినది. మఱునాడు గూడ వారట్లే దురపిల్లుచుండ నెక్కడనుండియో శివయ్య కొక యుత్తరమువచ్చినది. దాని నాత డాతురతతో విచ్చి చూడ, అం దిట్లు వ్రాయబడి యున్నది:

"పూజ్యులైన శ్రీతండ్రిగారిపాదపద్మములకు తమ ప్రియ కొమార్తె పార్వతి నమస్కార శతములు.

నాన్నా—

నీవు ప్రేమపూర్వకముగా నేర్పిన గీర్వాణభాష నాకు మాంగల్యభిక్ష పెట్టినది. చూడుము:—

"నష్టే మృతే ప్రవ్రజితే క్లీబేచ పతితే పతౌ,
పంచ స్వాపత్సు నారీణాం పతి రన్యో విధీయతే."
—పరాశరుడు.

"పాణిగ్రహే మృతే బాలా కేవలం మంత్రసంస్కృతా,
సాచే దక్షత యోని స్స్యాత్ పునస్సంస్కార మర్హతి."
—వసిష్ఠుడు.

మతకర్తలగు మహర్షులవాక్యము లట్లుండ, సర్వ మంగళ విశేషదూషితమగు వైధవ్యావస్థతో నేనవయ నేల? శాస్త్రనిషిద్ధము కాదని యెఱిగినపిదప నేనే పునర్వివాహమున కంగీకరించితిని. నీప్రియ కొమార్తెనైన నేను నీసహజవాత్సల్యమునకు దూరము గానని నమ్ముచున్నాను.

ఇట్లు: నీప్రేమంపుతనయ,
పార్వతి."

ఆయుత్తరమును చూడగనే శివయ్య గుండెబాదుకొని కొమార్తె పెండ్లాడుచున్నందుకు గాక ప్రతిష్ఠ పోయినందులకే కొంత యేడ్చి, 'సాధ్యమైతే చప్పుడు గాకుండా తీసుకవస్తాము' అనిచెప్పి, సమాచార మెవ్వరికి చెప్పకుండ, భార్యాసహితుడై గుంటూరు వెళ్లినాడు.

౧౧

సుప్రసిద్ధులగు లక్ష్మీనారాయణ పంతులుగారి యుదారకృషిచే పార్వతీ శంకరుల వివాహము మహా వైభవముగా జరిగినది. కొమార్తెయత్నము నేవిధముగానైన మాన్పి యింటికి తీసికొనిరావలె ననునూహతో వెడలిన శివయ్యశాస్త్రి గుంటూరుజేరి, లక్ష్మీనారాయణ పంతులుగారి యింటి కేగి చూడ,నప్పుడే పెండ్లిపీటలపై నుండి లేచి పెద్దపెద్ద లందఱకు నమస్కరించుచున్న పార్వతీ శంకరులు ప్రత్యక్షమైనారు. తండ్రిని చూచుటతోడనే తటాలున వచ్చి పాదములపై బడినది పార్వతి. తెల్లబోయి, తెలివి దెచ్చుకొని, "దీర్ఘ సుమంగలీ భవ" అన్నాడు శివయ్య!